ఇల్లెందు క్రీడాకారులు 'బంగారం'

పతకాలు సాధించిన క్రీడాకారులతో రమేష్

ఇల్లెందు, అక్టోబర్ 16: ఐదు జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో స్థానిక దుర్గా గోల్డెన్ జిమ్ క్రీడాకారులు ఐదు బంగారు పతకాలు సాధించారు. జిమ్ నిర్వాహకుడు కావేటి రమేష్ సోమవారం విలేకరులతో ఈ విషయం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణంలోని జైన్ మందిరంలో సోమవారం ఐదు జిల్లాల స్థాయి స్త్రీలు, పురుషుల బెంచ్ ప్రెస్ పోటీలు జరిగాయన్నారు. తమ జిమ్ క్రీడాకారులు ఐదు బంగారు పతకాలు సాధించినట్లు చెప్పారు. ఈ నెల 21న జరగనున్న రాష్ట్ర స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో వీరు పాల్గొంటారని అన్నారు. క్రీడాకారులు చీమల సుజాత, చింతా నాగరాజు, శ్రీనివాస్‌రావు, రాజ్‌కుమార్, దయాకర్, సందీప్, రాంకిషన్, మాధవి, సంపత్, ఎస్‌కె.నజీర్, శ్రీను, డాక్టర్ గట్టేశం, భార్గవ్, నవీన్ పాల్గొన్నారు.

ఇల్లెందు మట్టి.. ఢిల్లీకి

మట్టి సేకరించిన విద్యార్థులతో అధ్యాపకులు

ఇల్లెందు, అక్టోబర్ 16: మేరీ మిట్టి.. మేరా కలష్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీకి పంపేందుకు మట్టిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సేకరించారు. దీనిని ఢిల్లీకి పంపనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరంగం రామలింగేశ్వరరావు తెలిపారు. దేశవ్యాప్తంగా సోమవారం అమృత్ కలష్ యాత్ర జరిగిందని అన్నారు. అందులో భాగంగా తమ విద్యార్థులు కళాశాల ఆవరణలో మట్టిని సేకరించారని చెప్పారు. అమరవీరుల జ్ఞాపకార్థం దేశవ్యాప్తంగా విద్యార్థులు మట్టిని సోమవారం సేకరిస్తున్నారని అన్నారు. తమ విద్యార్థులు సేకరించిన మట్టిని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ ద్వారా ఢిల్లీలోని కర్తవ్య పథ్‌కు పంపుతామన్నారు. అక్కడ ఈ మట్టిలో మొక్కలు నాటుతారని చెప్పారు. మట్టి సేకరణ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు తోర్తి జాన్, విలియం ప్రసాద్, ఖాసీం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రీదేవి అవతారంలో అమ్మవారు



పూజలు చేస్తున్న భక్తులు

టేకులపల్లి, అక్టోబర్ 16: దేవీనవరాత్రి ఉత్సవాల రెండవ రోజైన సోమవారం.. అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. స్థానిక రామాలయం పక్కన మండపంలో కొలువుదీరిన అమ్మవారికి సింగరేణి కోయగూడెం ఉపరితల గని ఎస్టేట్ ఆఫీసర్ భూక్యా తావుర్యానాయక్ దంపతులు పూజలు చేశారు.

మదన్‌లాల్ గెలుపునకు విస్తృత ప్రచారం



కాకర్లలో ప్రచారం చేస్తున్న నాయకులు

జూలూరుపాడు, అక్టోబర్ 16: వైరా బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ గెలుపునకు బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. కాకర్ల, పాపకొల్లు, కొమ్ముగూడెం, కరివారిగూడెం, బేతాళపాడు గ్రామాల్లో జరిగిన ఈ ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్‌కుమార్, నాయకులు చావా వెంకటరామారావు, సొబ్బని కోటేశ్వరరావు, పాతర్లపాటి వెంకయ్య, దేవయ్య, సుందరయ్య పాల్గొన్నారు.

1న ఇల్లెందులో సీఎం సభ

సభాస్థలిని పరిశీలించిన ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యే హరిప్రియ

గ్రౌండ్‌ను పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే

ఇల్లెందు, అక్టోబర్ 16: నవంబర్ 1న ఇల్లెందుకు సీఎం కేసీఆర్ రానున్నారు. స్థానిక జేకే కాలనీ సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. సభాస్థలిని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సోమవారం పరిశీలించారు. అనంతరం పార్టీ నాయకులతో వారు మాట్లాడుతూ.. తొమ్మిదిన్నర ఏండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను గడప గడపకూ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు పరుచూరి వెంకటేశ్వర్లు, ఎస్.రంగనాథ్, కుంటా నవాబ్, శీలం రమేష్, అబ్దుల్లా, గడ్డి శ్రీను, పాషా, వాసు, కౌన్సిలర్లు పద్మావతి, ఆజాం, లక్ష్మి, నవీన్, రవీందర్ తదితరులు ఉన్నారు.

గంజాయి పట్టివేత

గంజాయి సంచులు, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 16: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఇల్లెందు ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇల్లెందు ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ తెలిపిన వివరాలు.. వరంగల్ జిల్లా కాజీపేటకు చెందిన గాణిపాక సాయికృష్ణ, బల్లి నరసింహ కలిసి బైక్‌పై భద్రాచలం నుంచి వరంగల్‌కు గంజాయి తరలిస్తున్నారు. మండలంలోని కరెంటాఫీస్ ఏరియాలో టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. వారికి వీరిద్దరూ పట్టుబడ్డారు. వీరి నుంచి తొమ్మిది కేజీల ఎండు గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.2.25 లక్షలు ఉంటుంది. గంజాయిని స్వాధీనపర్చుకుని, వారిద్దరిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. బైక్‌ను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్, టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వరరావు, ఎస్సైలు రమాదేవి, గౌతమ్, కానిస్టేబుళ్లు రామకృష్ణ, వెంకటనారాయణ, గురవయ్య, సుమంత్, పాష, రవి, తులస్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

23న సింగరేణి గ్రౌండ్‌లో దసరా ఉత్సవాలు

గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న చైర్మన్

ఇల్లెందు, అక్టోబర్ 16: ఇల్లెందు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23న స్థానిక సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో దసరా ఉత్సవాలు జరగనున్నాయి. గ్రౌండ్‌ను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, కౌన్సిలర్లు కటకం పద్మావతి, ఆజాం, మొగిలి లక్ష్మి, అంకెపాక నవీన్, కుమ్మరి రవీందర్, బీఆర్ఎస్ నాయకుడు వాసు పాల్గొన్నారు.

భార్యపై దాడి.. అడ్డొచ్చిన వారిపై కూడా..

పాల్వంచ రూరల్, అక్టోబర్ 16: తన భార్య, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని దంతెలబోరకు చెందిన దంపతులు కారుమంచి అన్నమయ్య-మానస ఈ నెల 11న గొడవ పడ్డారు. మానస, అదే ఊరిలో ఉంటున్న తన అక్క వెంకటరమణ వద్దకు వెళ్లింది. అక్కడకు అన్నమయ్య వెళ్లి, భార్య మానసపై దాడికి దిగాడు. అడ్డు వచ్చిన ఆమె అక్క వెంకటరమణ, చెల్లెలు సావిత్రిపై కూడా దాడి చేశాడు. సావిత్రికి తీవ్ర గాయాలయ్యాయి. వారు కోలుకున్న అనంతరం సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అన్నమయ్యపై కేసు నమోదైంది.

పోలీస్ విధులను అడ్డుకున్న యువకునిపై..

పాల్వంచ రూరల్, అక్టోబర్ 16: పోలీస్ విధులను ఆటంకపరిచిన యువకునిపై కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 14న రాత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌లో వాచర్ డ్యూటీలో తేజావత్ నాగేశ్వరావు ఉన్నారు. ఆయన వద్దకు తోగ్గూడెం గ్రామ యువకుడు మహీపాల్ వచ్చాడు. వాచర్‌తో పరుషంగా మాట్లాడి, ఆయన విధులను ఆటంకపరిచాడు. వాచర్ ఫిర్యాదుతో మహీపాల్‌పై కేసు నమోదైంది.

అంగన్‌వాడీ టీచర్ మృతి

పాల్వంచ రూరల్, అక్టోబర్ 16: మండలంలోని ఉల్వనూరు అంగన్‌వాడీ టీచర్ ఎస్.శారద(30) అనారోగ్యంతో సోమవారం వరంగల్ ఆసుపత్రిలో మృతిచెందారు. మృతదేహాన్ని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజేత సందర్శించి నివాళి అలర్పించారు. అంత్యక్రియల ఖర్చులకు రూ.20వేలను కుటుంబ సభ్యులకు అందించారు. సీడీపీవో కనకదుర్గ, మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

లాభాల వాటా చెల్లించాలి

టేకులపల్లి,అక్టోబర్16: సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని కోరుతూ కేవోసీ మేనేజర్ సౌరబ్ సుమన్‌కు సింగరేణి కాలరీస్ వర్క్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. అంతకు ముందు, మేనేజర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నాయకులు నజీర్ అహ్మద్, కొంగర వెంకటేశ్వర్లు, గుగులోత్ కృష్ణ, శంకర్, అన్వేష్, పవన్‌కుమార్, వెంకటనర్సయ్య, షబ్బీర్, రవి, మైఖేల్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల పూజలు

ఇల్లెందు: పూజల్లో ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియానాయక్

పాల్వంచ: వేంకటేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే అభ్యర్థి వనమా

పాల్వంచ/ ఇల్లెందు/భద్రాచలం, అక్టోబర్ 16: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేతులమీదుగా బీ ఫారాలు అందుకున్న భద్రాద్రి జిల్లాకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు వనమా వెంకటేశ్వరరావు, బానోతు హరిప్రియానాయక్, తెల్లం వెంకట్రావు సోమవారం ఆలయాల్లో వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. పాత పాల్వంచ వెంకటేశ్వరుని ఆలయం, జగన్నాథపురంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో బీఆర్ఎస్ కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి వనమా కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. బీ ఫారం అందుకున్నందుకుగాను ఎమ్మెల్యేకు కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లెందు ఆంబజార్ రాందేవ్ బాబా ఆలయంలో బీఆర్ఎస్ ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియానాయక్ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నేతలు నాదెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, పరుచూరి వెంకటేశ్వర్లు, సుధీర్ తోత్లా, మనోహర్ తివారి, కొక్కు నాగేశ్వరరావు ఉన్నారు. భద్రాచలం బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు భద్రాద్రి రామయ్య ఆలయంలో పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ నేతలు అరికెళ్ల తిరుపతిరావు, చాట్ల రవికుమార్, పెద్దినేని శ్రీను, ఎండీ నవాబ్, తాళ్లపల్లి రమేశ్ గౌడ్, మైతీన్ బీ ఉన్నారు.

భద్రాచలం: రామయ్య సన్నిధిలో అభ్యర్థి తెల్లం